క్లుప్తంగా

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి



పోల్కంపల్లిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దౌల్తాబాద్‌: మనఊరు–మనబడి పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ తిరుమలస్వామి ఆదేశించారు. గురువారం దౌల్తాబాద్ మండలం పోల్కంపల్లి, చల్లాపూర్ గ్రామాల్లో జరుగుతున్న మనఊరు–మనబడి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోల్కంపల్లిలో పనులు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ హన్మప్పకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ



శ్యాంప్రసాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: సమైఖ్య భారతవని కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య అన్నారు. ముఖర్జీ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఒకే దేశం, ఒకే ప్రధాని, ఒకే రాజ్యాంగం శ్యాంప్రసాద్ ఆశయమని, అది ప్రస్తుతం అమలు చేస్తున్నారని చెప్పారు. నేటి యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి రాకశేఖర్, బీజేవైఎం అధ్యక్షుడు శరత్‌కుమార్, నాయకులు వెంకటేశ్, శివప్రసాద్, పటేల్ రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు బాగుండాలి



రాంపూర్ ఆశ్రమ పాఠశాలలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కుల్కచర్ల: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ బూతుల్లో ఏర్పాట్లు బాగుండాలని, అన్ని వసతులు కల్పించాలని వికారాబాద్ ఆర్డీఓ విజయ కుమారి ఆదేశించారు. గురువారం కుల్కచర్ల మండలం రాంపూర్, కామునిపల్లి పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న బూత్‌లను పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల్లో వెలుతురు సమస్య లేకుండా చూడాలని, అవసరమైన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకునేలా క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. తహసీల్దార్ రమేష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి తోడ్పాటు

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: వ్యవసాయ అనుబంధ రంగాలకు సహకార సంఘాల ఆధ్వర్యంలో రుణ సౌకర్యం కల్పించి, పారిశ్రామిక ప్రగతికి తోడ్పాటు నందిస్తామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో యాదయ్య అనే రైతుకు కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో పౌల్ట్రీ ఏర్పాటుకు రూ.16 లక్షల రుణం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాలతో పాటు అనుబంధ పారిశ్రామిక రంగాలకు రుణ సౌకర్యం కల్పించడం వలన చిన్నతరహా పారిశ్రామిక రంగంలో రైతులు అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సర్పంచ్ సామ్యారెడ్డి, నాయకులు కృష్ణయ్య, నర్సింహులు, కుమ్మరి స్వామి, చంద్రయ్య, మైపాల్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బంట్వారం: కోట్‌పల్లి మండలం లింగంపల్లి గ్రామంలో గురువారం బోనాలు పండుగ ఘనంగా జరిగింది. మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా.. వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడులెప్పుడు బాగుచేస్తరు సారూ?

- ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి
- సమస్యల వలయంలో సాల్వీడు ప్రాథమిక పాఠశాల
- నత్తనడకన మనఊరు–మనబడి పనులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



బురదమయంగా సాల్వీడు ప్రాథమిక పాఠశాల ప్రాంగణం

కుల్కచర్ల: 'మనఊరు–మనబడి'తో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని విద్యాశాఖ అధికారులు గొప్పలు చెబుతున్నారు. కానీ ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే 'మనఊరు–మనబడి' పనులను పూర్తిచేయాలని విస్తృత ప్రకటనలు చేశారు. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కుల్కచర్ల మండలంలో మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 23 పాఠశాలలను ఎంపిక చేశారు. ముందు అనుకున్నట్లే పనులు ప్రారంభించారు. కానీ మెజార్టీ పాఠశాలలో అభివృద్ధి పనులు అంతంతమాత్రమే సాగుతున్నాయి.

బిల్లులు అందక..

మనఊరు అభివృద్ధి పనులు ముందుగా సాల్వీడు గ్రామంలో ప్రారంభించారు. ఆర్భాటంగా పనులు ప్రారంభించినా.. నేటికీ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. 8 నెలలు కావస్తున్నా.. సగం పనులు కూడా పూర్తికాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో ఇంకా వంటగది, మరుగుదొడ్లు, ప్రహరి నిర్మించాల్సి ఉంది. వర్షం వస్తే పాఠశాల ప్రాంగణమంతా చిత్తడిగా మారుతోంది. రోడ్డు సరిగాలేక స్కూల్‌కు వెళ్లాలంటే బురదలోంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదేమిటని నిర్వాహకులను అడుగగా.. సకాలంలో బిల్లులు అందడం లేదని చెబుతున్నారు. అధికారులు మాత్రం త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని అంటున్నారు.

తొలగించని శిథిలాలు..

సాల్వీడు ప్రాథమిక పాఠశాలలో 90 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మనఊరు– మనబడి పనుల్లో భాగంగా పురాతన పాఠశాల భవనాన్ని కూల్చారు. కానీ భవన శిథిలాలను తొలగించలేదు. ఈ శిథిలాల కింద పాములు, క్రిమికీటకాలు ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే స్కూల్‌కు రెండువైపులా పంట పొలాలు ఉన్నాయి. ఈ పొలాల నుంచి విషపురుగులు కూడా వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షం వస్తే తిప్పలే



వర్షం వస్తే బురదలో నుంచే తరగతి గదిలోకి వెళ్లాల్సి వస్తోంది. బురదలో జారి పడిన సందర్భాలు ఉన్నాయి. రాళ్లు ఉండడంతో ఆడుకోవడానికి స్థలం సరిగ్గా లేదు. మైదానాన్ని చదును చేసి, ఆటవస్తువులను ఏర్పాటు చేయాలి. – **అభినవ్, 5వ తరగతి విద్యార్థి**

పర్యవేక్షిస్తున్నాం



సాల్వీడు పాఠశాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నిర్వాహకులకు బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనుల నిర్వహణలో ఆలస్యమవుతోంది.
– **హబీబ్ అహ్మద్, ఎంఈఓ, కుల్కచర్ల**

ఎవుసం సాగేదెట్లా?

భారమైన పశుపోషణ

- కాడెడ్లకు పెరిగిన డిమాండ్

మోమిన్‌పేట: వర్షాకాలంలో వ్యవసాయ పనులు చేపట్టాలంటే తప్పని సరిగా కాడెడ్లతోనే చేయాల్సి ఉంటుంది. కానీ ట్రాక్టర్లు ఎక్కువై.. ఎడ్లు తక్కువై రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎవుసం ముందుకు సాగేదెలా అని తలపట్టుకుంటున్నారు. ప్రస్తుతం కాడెద్దులు ఏళ్ల మీద లెక్కపెట్టే స్థాయికి చేరడంతో ఉన్నవాటితో గుంటుక తీయాలంటే అద్దె పిరమై.. సాగు కష్టంగా మారిందని, పశువులను సాకలేని పరిస్థితి, అద్దెకు తెచ్చుకొని సాగుచేయలేని దుస్థితి అని ఆవేదన చెందుతున్నారు. ట్రాక్టర్లతో కేవలం వేసవి కాలంలో దుక్కులు దున్నడం, రోటోవేటరు వేయడం, పత్తిని విత్తుకునేందుకు సాళ్ల ఏర్పాటు చేసుకోవడం తదితర పనులను పూర్తిగా వాహనాల సహాయంతో చేయవచ్చు. కానీ పత్తిలో కలుపు తీసేందుకు గుంటుక కొట్టాలంటే ఎడ్లు కావాల్సిందే. అలాంటి పశు సంపద తగ్గిపోయింది. దీంతో ఎడ్లు ఉన్న రైతువద్ద అద్దెకు తీసుకొని సాగు చేయాలంటే భారంగా ఉందని రైతులు చెబుతున్నారు.

కొనడం కాదు.. సాకటమే కష్టం

ప్రస్తుత సీజన్‌లో పత్తిచేలో గుంటుక తోలేందుకు ఎడ్లు అవసరం కావడంతో రోజు వారి అద్దె పెరిగిపోయింది. ఎకరాకు రూ.800లు ఇస్తే కానీ గుంటుకను తోలే ప్రసక్తే లేదని పశు సంపద కలిగిన రైతులు చెబుతున్నారు. రూ.1లక్ష పెడితే కానీ రెండు ఎడ్లు రాని పిరిస్థితులు ఉన్నాయని, వాటిని కొనడం కష్టం కాదు. పోషించడమే భారంగా మారిందని కర్షకులు వాపోతున్నారు.

నాలుగు సార్లు తోలాలి



పత్తి సాగులో కనీసం మూడు నుంచి నాలుగు సార్లు గుంటుకను తోలాలి. ఎకరాకు రూ.800లు అద్దె చెల్లించాల్సి వస్తోంది. రెండు నెలలు మాత్రమే గిరాకి ఉంటుంది. వేసవిలో పూర్తిగా ట్రాక్టర్ ద్వారానే దుక్కులు దున్నడం, రోటోవేటరు వేసుకోవడం, విత్తును విత్తుకొనేందుకు సాళ్ల చేసుకొంటాం.
– **జనార్దన్‌రెడ్డి, రైతు, మోరంగపల్లి**



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లిలో పత్తిలో గుంటుకను తోలుతున్న రైతు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దౌల్తాబాద్‌: ధర్నాలో మాట్లాడుతున్న కార్మికులు

దౌల్తాబాద్‌: తమ సమస్యలు పరిష్కరించాలని జీపీ మల్టీపర్పస్ కార్మికులు డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం గురువారం నుంచి సమ్మెబాట పట్టిన కార్మికులు.. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సాయిలు మాట్లాడారు. కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, హోదాను బట్టి పదోన్నతులు కల్పించడంతో పాటు వేతనాలు పెంచాలని కోరారు.

కనీస వేతనం అమలు చేయాలి

తాండూరు రూరల్‌: జీపీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.19,500 చెల్లించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్ అధ్యక్షులు శాంతమ్మ, శాంతప్ప, అంబరప్ప, నర్సింహులు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

దోమ: నిరుపేదలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. గురువారం దోమ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన డీవీటీ యాదయ్య అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఎంపీటీసీ రాఘవపురం రాములు, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి మృతుడి కుటుంబ సభ్యుల ను పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఉపసర్పంచ్ రఫీక్ పాష, వార్డు సభ్యులు చంద్రశేఖర్ ముదిరాజ్, పాఠశాల చైర్మన్ శ్రీనివాస్, బాబర్, వెంకటయ్య, షేర్‌ఖాన్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

త్వరలో క్రీడా మైదానాల నిర్మాణం

యాలాల: తెలంగాణ గ్రామీణ క్రీడా మైదానాల నిర్మాణం కోసం గురువారం అధికారులు స్థలపరిశీలన చేశారు. యాలాల మండలం బండమీదిపల్లి, తిమ్మాయిపల్లి, విశ్వనాథ్‌పూర్, రాఘవపూర్, అడాల్‌పూర్, బాణాపూర్ గ్రామాల్లో అటవీ హద్దులో ఉన్న భూములను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో క్రీడా మైదానాల నిర్మాణాలకు బ్రేక్ పడింది. కాగా ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో అటవీ భూముల్లో క్రీడా మైదానాల నిర్మాణానికి అటవీ అధికారులు సానుకూలంగా స్పందించారు. దీంతో ఏపీఓ జనార్దన్, ఈసీ శ్రావణ్‌కుమార్, టీఏలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీల సమక్షంలో భూములను గుర్తించారు. త్వరలో క్రీడా మైదానాల నిర్మాణాలను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

కమిషనర్ సేవలు శ్లాఘనీయం

వీడ్కోలు సమావేశంలో చైర్‌పర్సన్ మంజుల



శరత్ చంద్రకు వీడ్కోలు పలుకుతున్న చైర్‌పర్సన్, కార్యాలయ సిబ్బంది

వికారాబాద్ అర్బన్‌: మున్సిపాలిటీ అభివృద్ధికి కమిషనర్ శరత్ చంద్ర ఎంతో సమన్వయంతో శ్రమించారని చైర్‌పర్సన్ మంజుల అన్నారు. కమిషనర్ శరత్ చంద్ర బదిలీపై బండ్లగూడకు వెళ్తున్న సందర్భంగా గురువారం పుర కార్యాలయంలో కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రెండేళ్లుగా మున్సిపాలిటీకి కమిషనర్ ఎనలేని సేవలు అందించి, ప్రజల ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. బండ్లగూడ మున్సిపాలిటీలో.. అక్కడి ప్రజలకు ఆయన మెరుగైన సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం కమిషనర్‌కు చైర్‌పర్సన్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ సురేష్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పతనం ఖాయం

మాజీమంత్రి ప్రసాద్‌కుమార్



పార్టీలో చేరిన వారితో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

ధారూరు: రానున్న సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ పతనం ఖాయమని మాజీమంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్‌కుమార్ జోస్యం చెప్పారు. ధారూరు మండలం పీసీఎంతండా, అంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ అవినీతికి పాల్పడుతూ తాము నిజాయితీ పరులమని ప్రకటిస్తున్నారని, ఎమ్మెల్యే, మంత్రి స్థాయి నుంచి సీఎం వరకు అందరూ అక్రమ సంపాదనకే అలవాటు పడ్డారని ఆరోపించారు. వీరిని ప్రజలు గమనిస్తున్నారని, ఓటు అనే ఆయుధంతో తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయ భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బల్వంత్‌రెడ్డి, మల్లారెడ్డి, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

మండల విద్యాధికారి హరిశ్చందర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

పరిగి: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల బాలుర, సుల్తాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థిని దృష్టిలో పెట్టుకుని విద్యనందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

పరిగి: వర్షాకాలం నేపథ్యంలో వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. గురువారం 12,15వ వార్డులో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి మాట్లాడారు. కాలనీల్లో అన్ని మురుగు కాలువలను శుభ్రం చేయిస్తానని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు మునీర్, నాయకులు తాహేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

• బ్రాహ్మణగర్జనను విజయవంతం చేయాలి

పరిగి: బ్రాహ్మణుల సంక్షేమం కోసం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని పరిగి ఎంపీపీ కరణం అరవిందరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద బ్రహ్మగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బ్రాహ్మణుల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 9న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు బ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

• సీసీ పనులు ప్రారంభం

యాలాల: మండల పరిధి జుంటుపల్లిలో రూ.6 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)తో గురువారం సీసీరోడ్డు పనులను సర్పంచ్ వెంకట్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో, అవసరమైన చోట సీసీతో పాటు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

• అందరికీ ప్రభుత్వ వైద్యం అందేలా కృషి

పెద్దేముల్‌: ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ వైద్యం అందించేలా కృషి చేస్తామని పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు తెలిపారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ పల్వన్‌కుమార్ ఆదేశాల మేరకు యన్‌సీడీ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ యన్‌సీడీ క్యాంపు ద్వారా 530 మందికి షుగర్, బీపీతో పాటు జనరల్ పరీక్షలు చేశామని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో యన్‌సీడీ క్యాంపు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమేద్, పీహెచ్‌యన్ అరుణకుమారి, వైద్య సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

• పార్టీని బలోపేతం చేసేందుకే కమిటీలు

మర్పల్లి: బూత్ స్థాయిలో బీఎస్పీని బలోపేతం చేసేందుకే గ్రామాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ వికారాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తలారి రాజు అన్నారు. గురువారం మర్పల్లి మండలం ఘణాపూర్‌లో బూత్ కమిటీలను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు.

• అనారోగ్యంతో సర్పంచ్ మృతి



యాలాల: అనారోగ్యంతో యాలాల మండలం కోకట్ సర్పంచ్ ప్యాట హంసమ్మ(65)గురువారం సాయంత్రం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందారు. హంసమ్మ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త శంకర్‌రెడ్డి, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

• సీఐని కలిసిన రెడ్డిజాగృతి నాయకులు

బంట్వారం: ధారూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను రెడ్డి జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి శరణారెడ్డి గురువారం పోలీస్ హెడ్ క్వార్టర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఐతో పలు అంశాలపై చర్చించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు సంజీవరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రాం



పెద్దేముల్‌: జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జై భీం నేతలు



అనంతగిరి: జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

పెద్దేముల్‌: 'బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రాం. నేటి యువతకు ఆదర్శప్రాయుడు, ఆయన అడుగు జాడల్లో నడవాలి' అని జై భీం యువజన సంఘం నాయకులు అన్నారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్, జై భీమ్ యూత్ అధ్యక్షుడు బాలరాజ్, గౌరవ అధ్యక్షుడు దావిద్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆయన చిత పటానికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల నర్సింహులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రాం అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నరేందర్, చిన్న అనంతయ్య, నర్సింహులు ఉన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్‌: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో పలు సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జగ్జీవన్‌రాం యువజన సంఘం అధ్యక్షుడు కృష్ణంరాజు, వివిధ సంఘాల నాయకులు సోమశేఖర్, రమేష్‌బాబు, ఆశప్ప, సూర్యానాయక్, కనకప్ప, భరత్, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: బడుగు బలహీన వర్గాల ఉన్నతికి బాబు జగ్జీవన్‌రాం ఎంతో కృషి చేశారని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీం రెడ్డిలు అన్నారు. జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని చిన్నగేటు దగ్గరలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉప ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్‌కుమార్, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండలం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్ సామ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం ఉన్నారు.



యాలాలలో..



కొడంగల్ రూరల్‌లో..



కుల్కచర్లలో.. డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి తదితరులు